ప్రజాశక్తి

సోమవారం 13 మే 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కన్నోళ్లకు కడుపుకోత

- మాతృదినోత్సవం రోజు రోడ్డుప్రమాదానికి గురైన ముగ్గురు కూతుళ్లు..
- ఇద్దరు అక్కడికక్కడే మృతి..
- మృత్యువుతో పోరాడుతున్న మరో కుమార్తె..
- శోకసంద్రంలో తల్లిదండ్రులు
- ఓటేసేందుకు వస్తుండగా.. ప్రమాదం




ప్రమాదం జరిగిన స్థలం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మాతృదినోత్సవం రోజు ఆ తల్లిదండ్రులకు కడుపుకోతే మిగిలింది. కారు వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు కూతుళ్లూ ప్రమాదానికి గురికాగా.. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో కూతురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాలికల బాబాయి కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటన చినగంజాం మండలం, రొంపేరు బ్రిడ్జి సమీపంలో జాతీయరహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు ఓటు వేసేందుకు సొంతూరుకు వస్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది.

కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. బాపట్లకు చెందిన యాలవల వెంకటేశ్వర్లు, భారతి దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరు లోని ఒక మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నాడు. ఎన్నికల నేపథ్యంలో స్వగ్రామం అయిన బాపట్లలో ఓట్లు వేసేందుకు భార్యాభర్తలిద్దరూ ఒక బైక్‌పై, ముగ్గురు ఆడపిల్లలు, వెంకటేశ్వర్లు తమ్ముడు లక్ష్మయ్య మరో బైక్‌పై బాపట్లకు బయలుదేరారు. చినగంజాం రొంపేరు కాలువ వద్దకు వచ్చేసరికి పొన్నూరు వైపు నుండి ఒంగోలు వెళుతున్న కారు అతివేగంగా పిల్లలతో ఉన్న బైక్‌ను వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ప్రమాదంలో దేవిసంధ్య(11), జస్విత(9) అక్కడికక్కడే మతిచెందారు. మరో బాలిక అశ్విని, బాబాయి లక్ష్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ▶ 2లో



దేవిసంధ్య (ఫైల్)



జస్విత (ఫైల్)

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- అసెంబ్లీకి 158 మంది.. పార్లమెంటుకు 32 మంది అభ్యర్థులు
- తీర్పు ఇవ్వనున్న 18,22,470 మంది ఓటర్లు..
- 2183 పోలింగ్ కేంద్రాలు..
- సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సార్వత్రిక సమరానికి సర్వం సన్నద్ధమైంది. ఓటర్లూ ఓటేసేందుకు సిద్ధంగానే ఉన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు తమ భవితవ్యంపై ఉత్కంఠగా ఉన్నారు. ప్రచారం.. పంపిణీలు ముగిశాయి. అందరూ సిద్ధం అంటే సిద్ధం అంటున్నారు. ఓటర్ల తీర్పే కీలకం కానుంది. పాలకులు ఎవరో తేల్చనున్నారు. సోమవారం నాడు జరిగే పోలింగ్‌కు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. పోలింగ్ సామాగ్రితో సిబ్బంది కేంద్రాలకు తరలి పోయారు. కలెక్టర్ దినేష్‌కుమార్ పంపిణీ కేంద్రాలను సందర్శించారు. అన్ని ఏర్పాట్లూ చేశారు. అన్ని సౌకర్యాలున్న పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా పెట్టారు. మరో వైపు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 158 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. పార్లమెంటుకు 32 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 18,22,470 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 9,07,980 మంది ఉండగా 9,14,379 మంది మహిళలున్నారు. 14.46 లక్షల మంది ఓటర్లకు స్లిప్పులు కూడా పంపిణీ చేశారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది సామగ్రితో తరలివెళ్లారు. నియోజకవర్గ స్థాయిలో రిటర్నింగు అధికారులు పూర్తి పర్యవేక్షణ చేస్తున్నారు. పోలీసుశాఖపరంగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు పెట్టారు. ఒంగోలు సమస్యాత్మక నియోజకవర్గంగా ఉన్నందున అదనపు బలగాలను రంగంలోకి దింపారు. సిఆర్‌పిఎఫ్ దళాలు ఒంగోలుకు వచ్చాయి. పట్టణంలో కవాతు కూడా నిర్వహించాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఇక పార్టీలు సన్నద్ధంగా ఉన్నాయి. వైసిపి, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల తరపున పోటీలో ఉన్న అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం పూర్తి చేశారు. ప్రధానంగా వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్యే పోటీ ఉంది. పశ్చిమాన వైసిపికి అనుకూలంగా ఉందనే చర్చ ఉంది. తూర్పు నియోజకవర్గాలు తెలుగుదేశం అభ్యర్థులకు అనుకూలంగా ఉంటాయన్నది విశ్లేషణ. కొన్ని చోట్ల నువ్వానేనా అన్నట్లుగా పోటీ ఉంది. ఓటర్లకు రూ.3 వేలు చొప్పున రెండు నియోజకవర్గాల్లో పంపిణీ చేశారు. వైసిపి అభ్యర్థులే ▶ 2లో



పోలింగ్ సామగ్రిని చెక్ చేసుకుంటున్న ఉద్యోగులు



పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న ఉద్యోగులు

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా పోలీస్ అబ్జర్వర్ హసీబ్‌ఉర్ రెహమాన్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా పోలీసు అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు టౌన్‌లోని ఏబీఎస్ జూనియర్ కాలేజ్, మున్సిపల్ ప్రైమరీ స్కూల్, బండమెట్టలోని గర్ల్స్ హై స్కూల్ మరియు సెండ్ థెరీసా స్కూల్ లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం పోలీస్ అబ్జర్వర్ సందర్శించి ఆయా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, బందోబస్తు వివరాలు మరియు ఇతర అంశాలను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, పకడ్బందీగా జరగడానికి చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎన్నికల నియమావళి నిక్కచ్చిగా అమలు పరచాలని ఆదేశించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్

8 వేల బియ్యం బస్తాలు స్వాధీనం

- 6 లారీలు, 8 ఆటోలు సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి జిఎస్ సునీల్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఓటర్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న 8 వేల బియ్యం బస్తాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న 6 లారీలు, 8 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకొని, ఓ రైస్ షాపుపై కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఒంగోలు నగరంలో దాడులు నిర్వహించి ఓటర్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న 8 వేల రైస్ బ్యాగ్‌లు, 6 లారీలు, 8 ఆటోలు, ఒక షాపును సీజ్ చేశామన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి బియ్యం నిల్వ ఉంచిన రైస్ మిల్లు యజమానిపై చర్యలు తీసుకున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా మద్యం, నగదు ఉచిత గిఫ్టులు ఇస్తే జిల్లా కంట్రోల్ రూమ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లు ఎన్నికలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని ఆయన సూచించారు.

గ్రోత్ సెంటర్లో రైస్‌మిల్ సీజ్

మద్దిపాడు: ఒంగోలు, గ్రోత్ సెంటర్‌లో ఆదివారం 3 లారీల బియ్యం బస్తాలను అధికారులు పట్టుకున్నారు. తెల్లవారుజామున గ్రోత్ సెంటర్‌లో ఓ రైస్‌మిల్లు పై ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడి చేసి బియ్యం ఉన్న మూడు లారీలను అదుపులోకి ▶ 2లో

పోలింగ్‌కు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ మొత్తంలో డబ్బులు పంపిణీ చేశారు. మద్యం, బియ్యం, కూరగాయలు, మాంసం కూడా అందజేశారు. స్లిప్పులు ఇచ్చి దుకాణాలకు వెళితే వాటిని ఇస్తారని చెబుతున్నారు. అధికారులు నిఘా పెట్టి.. బియ్యం దుకాణాలు సీజ్ చేస్తున్నారు. లారీల కొద్దీ బియ్యం కూడా పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇవి ఎక్కువగా ఉన్నాయి. వీటిని అరికట్టడంలో మాత్రం యంత్రాంగం వైఫల్యం చెందిందనే చెప్పాలి. ఓటర్లు మాత్రం ఓటుహక్కును వినియోగించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న యువత, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థుల కోసం అభ్యర్థులు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు.

కన్నోళ్లకు కడుపుకోత..

(మొదటిపేజీ తరువాయి)

చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారు అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. కారులోని వారు కూడా ఓటు వేసేందుకే హైదరాబాద్ నుంచి పొన్నూరు వచ్చి.. ఒంగోలు వెళుతూ రోడ్డు ప్రమాదానికి కారణమయ్యారు. ఇద్దరు పిల్లలు విగతజీవులు కాగా మరో బిడ్డ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చేరడంతో ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. చిన్నగంజాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 వేల బియ్యం బస్తాలు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 2778 బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ దాదాపు రూ.34 లక్షల వరకు ఉంటుందని అంచనా. రైస్ మిల్ ఓనర్ మట్ట శ్రీహర్షపై కేసు నమోదు చేశారు. రైస్‌మిల్లుని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఓటు వేస్తే వైద్య పరీక్షలు ఉచితం

డాక్టర్ తాడివలస దేవరాజు

ప్రజాశక్తి-చీరాల



ఓటు హక్కు భారత రాజ్యాంగం మనకు అందించిన ఆయుధమని, ఓటు వేయడం మన అందరి బాధ్యత అని చీరాల కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మంచి వ్యక్తిని ఎన్నుకుంటే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చీరాల, పర్చూరు, బాపట్ల నియోజకవర్గాలలో ఓటు శాతం పెంచడానికి సామాజిక బాధ్యతగా ఓటర్లకు ఆయన ఓ ఆఫర్ ప్రకటించారు. ఓటు వేసిన వారికి షుగర్ పరీక్ష, ఈసీజీ పరీక్ష ఉచితంగా చేస్తామని, ఇందుకు వేలుకు వేసిన సిరా మార్కు చూపించాలని అన్నారు. కాబట్టి ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించుకుని ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్లు తహశీల్దారు ఎం ప్రమీల తెలిపారు. ఎన్నికల సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకొల్లు మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో 20 గ్రామాల్లో 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంకొల్లు గ్రామ పంచాయతీ పరిధిలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు.

ఐనముక్కలలో బోనాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని ఐనముక్కల గ్రామంలో ఉన్న పోలేరమ్మ, అంకాలమ్మ దేవతామూర్తులకు 41వ రోజు సందర్భంగా ఐనముక్కల గ్రామంలోని కొండారెడ్డి కాలనీ వాసులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పండుగ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చీరాలలో 2,02,711 మంది ఓటర్లు

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఇవిఎంలు ● పోలీస్ 30యాక్టు,144 సెక్షన్ అమలు ● నియోజకవర్గంలో ప్రత్యేక పోలీసు బలగాల పహారా

ప్రజాశక్తి-చీరాల

సోమవారం జరగనున్న సాధారణ ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూము నుంచి ఈవీఎంలను ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు జిపిఎస్ ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా సిబ్బందితో ఎన్నికల సామగ్రిని తరలించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సామగ్రిని తరలించి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ విధానాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా ఎన్నికల తీరును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. ఇక అభ్యర్థుల విషయానికి వస్తే మొత్తంగా 15 మంది అభ్యర్థులు వారికి కేటాయించిన గుర్తుతో పాటుగా నోటాతో కలిపి 16 కాలాలు ఈవిఎంలో పొందుపరిచారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. చీరాల నియోజకవర్గంలో మొత్తం 2,02,711 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 98,729 మంది కాగా, స్త్రీలు 1,03,958 మంది. ట్రాన్స్ జెండర్ 24 మంది ఉన్నారు. ఇక నియోజకవర్గంలో మొత్తం 218 పోలింగ్ కేంద్రాలును అధికారులు ఏర్పాటు చేశారు. 1540 మంది పిఓలు, ఎపిఓలు, ఓపిఓలు ఎన్నికల సిబ్బంది ఉన్నారు. ఆర్ఓ సూర్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో ఎన్నికల అధికార, సిబ్బంది అందరూ పకడ్బందీగా ఎన్నికల నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎండాకాలం కావడంతో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు, తాగునీరు, కనీస వసతులను ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో పోలీస్ 30 యాక్ట్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని డిఎస్పీ బేతపూడి ప్రసాద్ తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలు పోలింగ్ కేంద్రాల వద్ద పహారా కాస్తున్నాయి. భారీ పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ నిర్వహించనున్నారు. కాబట్టి ఓటర్లు అందరూ తమ ఓట్లు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డిఎస్‌పి కోరారు.





ఉమెన్స్ కళాశాలలో ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన టెంట్, పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వెబ్ కాస్ట్ కెమెరా



పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్

ఎన్నికల బందోబస్తులో..

3 వేల మంది పోలీస్ సిబ్బంది

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సోమవారం ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల బందోబస్తు విధుల్లో 9 పోలీస్ బెటాలియన్ల నుంచి 690 మంది, తమిళనాడు పోలీస్‌ఫోర్సు నుంచి 250 మంది, జిల్లా పోలీస్ ఫోర్స్ 1407, మాజీ సైనికులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ నుంచి 745 మంది మొత్తంగా 3092 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. పోలింగ్ సమయంలో ఈవీఎంల ధ్వంసానికి పాల్పడినా, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందిపై ఘర్షణలకు పాల్పడినా వారిపై అత్యంత తీవ్రమైన కఠిన చర్యలుంటాయని అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలోపు ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదు. వాహనాలకు అనుమతి లేదు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అయిదుగురికి మించి గుమిగూడరాదు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి మూడు వాహనాలను అనుమతిస్తారు. ఒక్కొక్క వాహనంలో ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. జిల్లాలో మొత్తం 913 పోలింగ్ లొకేషన్లు ఉండగా వాటిలో 269 లొకేషన్లు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వివిధ పార్టీ అభ్యర్థుల తరపు వారు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధి వెలుపల ఓటరు స్లిప్పులను ఇవ్వడానికి ఏర్పాటు చేసుకోవచ్చు.

ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా..

12 రకాల గుర్తింపు కార్డులు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం పోలింగ్ రోజున ఓటరు గుర్తింపుకార్డుతో పాటు 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఈ దిగువ పేర్కొన్న గుర్తింపు కార్డులు ఏదో ఒకదానితో ఓటుహక్కు వినియోగించుకోవచ్చునని కలెక్టర్ చెప్పారు.

- ఆధార్‌కార్డు, – ఎంజిఎన్ఆర్ఈజిఎస్ జాబ్‌కార్డు
- బ్యాంకు, పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్
- కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేయబడిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్సు
- పాన్‌కార్డు
- ఎన్‌పిఆర్ (నేషనల్ పాపులేషన్ రిజిష్టర్) కింద ఆర్‌జిఐ (రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా) జారీ చేసిన స్మార్ట్‌కార్డు
- భారతీయ పాస్‌పోర్టు
- ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంటు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, పిఎస్‌యులు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ద్వారా ఉద్యోగులకు జారీ చేయబడిన ఫొటోతో కూడిన సేవా గుర్తింపుకార్డు
- ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేయబడిన అధికారిక గుర్తింపుకార్డులు
- సామాజికన్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ జారీ చేసిన ప్రత్యేక వైకల్యం ఐడి (యుడిఐడి) కార్డు

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల వారి దోపిడీని అరికట్టే వారు లేరా అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో అవసరాన్ని బట్టి టికెట్ ధరను రెట్టింపు చేసి చూపిస్తున్నా అధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోక పోవడం పట్ల ప్రయాణికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సిఎస్ పురం నుంచి బెంగళూరుకు ఆర్టీసీ బస్సులలో రూ.700 ఛార్జి ఉండగా ప్రైవేట్ ట్రావెల్స్ వారు రూ.800గా టికెట్ ధరను నిర్ణయించారు. అయితే సీజన్‌ను బట్టి ప్రైవేట్ ట్రావెల్స్ వారు టిక్కెట్టు ధరను రెట్టింపు చేసి వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలలో ఓట్లు వేసేందుకు బెంగళూరు నుంచి ఓటర్లు తమ సొంత గ్రామాలకు వస్తున్నారు. దీంతో రద్దీ పెరగడంతో ప్రైవేట్ ట్రావెల్స్ వారు టికెట్ ధరను దాదాపు రూ.2,000 దాకా పెంచి వసూలు చేస్తున్నారు. ఈ టికెట్ ధరలు ఆన్‌లైన్లో కూడా ప్రకటించారు. ప్రజల అవసరాన్ని బట్టి ప్రైవేటు ట్రావెల్స్ వారు ఈ విధంగా సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం ప్రశ్నిస్తున్నారు. ఒక్క బెంగళూరు సిఎస్ పురం రూట్‌లో మాత్రమే కాదు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో సైతం ప్రజల అవసరాన్ని బట్టి అధికంగా టికెట్ వసూలు చేస్తున్నారు. ఇంత పబ్లిక్ గా ప్రజలను లూటీ చేస్తున్నా అధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ వారి లూటీలో అధికారులకు వాటా ఉందా, ప్రజల అవసరాన్ని బట్టి టికెట్ ధరలు పెంచుకోమని ప్రభుత్వం ఏమన్నా జీవో జారీ చేసిందా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ బస్సులలో టికెట్ ధరలు స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం ఏడు గంటలకే ప్రారంభం కానుంది. బాపట్ల నియోజకవర్గ అభ్యర్థులు ఉదయం ఏడు గంటలకే ఓటేస్తారని ఆయా పార్టీలు తెలిపాయి. బాపట్ల పట్టణం చిల్లర గొల్లపాలెం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 గంటలకే బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ ఎస్ఎంజి హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును ఉదయం 7 గంటలకే వినియోగించుకుంటారని ఆ పార్టీ ప్రతినిధి తెలిపారు.

చెరువులనూ వదల్లా..!

- బోర్లు వేసి మరి సాగు
- స్టైంచ్‌లు చెడగొట్టి చెరువులు పూడ్చి అక్రమ కట్టడాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



అమానిగుడిపాడు చెరువు భూమిలో సాగు చేసిన నిమ్మతోట



దున్ని సాగుకు సిద్ధం చేసిన గురిజేపల్లి చెరువు స్థలం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రామాల బాగు కోసం తాతల నాడు చెరువులు తవ్వారు. ఇప్పుడు అక్రమార్కులు కొందరు వాటిని పూడ్చి వేస్తున్నారు. వర్షపు నీటితో కళకళలాడుతూ ప్రజలకు ఉపయోగ పడాల్సిన చెరువులు ఆక్రమణల కారణంగా కనుమరుగై పోతున్నాయి.

రెండు మండలాల్లో..

యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో అక్రమార్కులు చెరువుల భూములు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసి గతంలో చెరువులను సర్వే చేసి వాటి పూర్తి విస్తీర్ణం వరకు హద్దులు నిర్ణయించి బౌండరీ పేరుతో స్ట్రెంచ్‌లు తవ్వారు. ఇందు కోసం లక్షలాది రూపాయలు ఇరిగేషన్ శాఖ ఖర్చు పెట్టింది. కానీ స్ట్రెంచ్‌లు తీసిన తర్వాత అక్రమార్కులు వాటిని మళ్లీ పూడ్చివేసి సాగు చేస్తున్నారు. ఇదంతా అధికారులు చూసినా చేసేదేమీలేక మిన్నకుండిపోతున్నారు. ఈ రెండు మండలాల్లో అధికారిక లెక్కల ప్రకారమే వివిధ చెరువుల్లో 650 ఎకరాలను ఆక్రమించి చెరువు భూములను సాగు చేస్తున్నారు. వాటిలో కొంత తొలగించామని అధికారులు లెక్కలు చూపుకుంటున్నా అదంతా అవాస్తవమని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తెలిసిపోతుంది.

యర్రగొండపాలెం మండలంలో అక్రమాలు ఇలా..

యర్రగొండపాలెం మండలంలోని యర్రగొండపాలెం, మిల్లంపల్లి, కొలుకుల, గురిజేపల్లి, అమానుగుడిపాడు తదితర గ్రామాల్లో చెరువులను పలువురు సాగు భూములుగా మార్చారు. అధికారుల లెక్కల ప్రకారం కొలుకుల గ్రామంలోని చెరువులో ఎక్కువగా 68.68 ఎకరాల్లో చెరువును ఆక్రమించారు. అమానుగుడిపాడు చెరువులో కూడా 51.35 ఎకరాల్లో ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. మురారిపల్లి చెరువులో ఆక్రమణలు జరిగినా అధికారులు మిన్నకుండిపోవటానికి కారణమేమి టని పలువురు ప్రశ్నిస్తున్నారు. మిల్లంపల్లి చెరువులో 28.13 ఎకరాలు, గురిజేపల్లి చెరువులో 14.22, వీరభద్రాపురం చెరువులో 5 ఎకరాలు సాగు చేస్తున్నట్లు గుర్తించామని అధికారులు చెబుతున్నారు. ఇలా మొత్తం మండలంలో 225 ఎకరాలు చెరువు భూమి సాగు భూమిగా మారింది. కానీ గుర్తించిన పూర్తి వివరాలు వెల్లడించడం లేదు. పైగా అన్ని చెరువుల్లో కూడా ఆక్రమణదారులు వ్యవసాయ బోర్లు వేసుకొని దర్జాగా సాగు చేసుకుంటున్నారు. చెరువులు నిండినా బోర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చి విద్యుత్ అధికారులు పరోక్షంగా చెరువుల నష్టానికి సహకరిస్తున్నారు. పైగా తమకు దరఖాస్తులో చూపే సర్వే నెంబర్ భూమి ఆనుకుంటాము తప్ప చెరువులని తమకు తెలియదు కదా అని సాకులు చెబుతున్నారు.

పుల్లలచెరువు మండలంలో ఇలా..

పుల్లలచెరువు మండలంలో ఎక్కువగా చెరువులపైనే అక్రమార్కుల కన్నుపడింది. మండలంలోని మొత్తం చెరువుల్లో 425.23 ఎకరాల్లో ఆక్రమణకు గురై వ్యవసాయ భూములుగా మారాయి. కానీ ఈ విస్తీర్ణం ఇంకా ఎక్కువగానే ఉంటున్నా అధికారులు పూర్తి స్థాయి అక్రమాలను బయట పెట్టడం లేదు. పుల్లలచెరువు మండలంలోని రాచకొండ బురకారెడ్డి చెరువులో 45 ఎకరాలు, చాపలమడుగు చెరువులో 65.51, యండ్రపల్లి చీమలదిన్నె చెరువులో 30, గంగవరంలోని చీకటి చెరువులో 42.50 ఎకరాల్లో చెరువులు సాగు భూములుగా మారిపోయాయి. మొత్తం 35 చెరువుల్లో కేవలం 6 చోట్ల మాత్రమే చెరువులు సక్రమంగా ఉండగా మిగిలిన అన్నిచోట్ల కలిపి 425.34 ఎకరాల్లో చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. చాపలమడుగు, గంగవరం చీకటి చెరువుల్లో వ్యవసాయ బోర్లు విచ్చలవిడిగా వేసి సాగు చేయటం, వాటికి విద్యుత్ శాఖాధికారులు కనెక్షన్‌లు ఇవ్వడం విశేషం. చీకటి చెరువులో 14 బోర్లు వేసి సాగు చేస్తున్నారు. పుల్లలచెరువులో గ్రామం మధ్యలో ఉన్న కాటివీరన్న చెరువును పూడ్చి మరీ అక్రమంగా కట్టడాలు కడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు శూన్యం. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు వారి జోలికి రావడం లేదు. కట్టే ప్రతి ఇల్లూ వెనుకెనుకకు జరుగుతూ చెరువును పూడ్చుకుంటూ వెళుతున్నారు. చెరువు అలుగు ఇప్పుడు అదృశ్యమవుతోందంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతోంది. చెరువుతట్టు భూములకు, అలుగు భూములకు కూడా కొందరు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వడం, వాటిని అడ్డుపెట్టుకొని కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకురావడం పరిపాటిగా మారింది

హద్దుల పేరుతో లక్షల నిధులు వృథా..

గతంలో అన్ని మండలాల్లో చెరువులన్నీ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించారు. వారు గుర్తించి అక్రమాల వివరాలు తీసుకున్న జిల్లా అధికారులు ఇరిగేషన్ శాఖ ద్వారా చెరువుల్లో హద్దులు నిర్ణయించి చెరువుల చుట్టూ స్ట్రెంచ్‌లు తీశారు. ఇందుకోసం లక్షల రూపాయలను గ్రామాల్లో కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు తప్ప ఇవన్నీ దుర్వినియోగమయినట్లే. తీసిన బౌండరీలు కొంత అయితే బిల్లు చేసింది రెట్టింపుగా కనిపిస్తోంది. మరోవైపు హద్దులు తీసిన తర్వాత మరలా వాటిని పూడ్చివేసి ఇప్పటిలాగానే ఆక్రమణదారులు సాగు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల కాంట్రాక్టర్లే స్వయంగా రైతులతో మాట్లాడి మా పని ముగిసే వరకు మౌనంగా ఉండండి..మేము బిల్లులు చేయించుకున్న తర్వాత మరలా యథావిధిగా చేసుకోండి అంటూ చెబుతున్నారు. లోతు తక్కువగా తూతూ మంత్రంగా పనులు చేసిన చెరువులు కూడా ఉన్నాయి. మొత్తానికి గ్రామాల్లో నీటి వనరులుగా పూర్వం నుంచి ఉన్న చెరువులు ఇప్పుడు అక్రమార్కుల చెరతో ఉన్నాయి. వారి నుంచి చెరువులకు వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై చిన్న నీటిపారుదల శాఖ డీఈ జి మురళీ మోహన్‌ను వివరణ కోరగా చెరువు భూముల ఆక్రమణదారులకు నోటీసులివ్వనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల సహకారంతో చెరువు భూములను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఫ్లోరెన్స్ నైటింగేల్ 204వ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పిపి యూనిట్‌లో నర్సుల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రకాశం జిల్లా కమిటీ కార్యదర్శి కమ్మ శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కోసి నర్సులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997 నుంచి వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా రాజీ లేని పోరాటాలు చేసినట్లు తెలిపారు. ఫలితంగా అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ అయినట్లు తెలిపారు. మిగిలి ఉన్న వారిని కూడా త్వరలో రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు అంకిత భావంతో రోగులకు సేవలు అందిస్తున్నారన్నారు. సిబ్బంది కొరత, ఆన్‌లైన్ యాప్‌ల వల్ల పనిభారం పెరిగిందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి. నాగేశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య ఉద్యోగులు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్‌లో మద్యం

ప్రజాశక్తి-పిసిపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు అధికారులు శనివారం సీల్ వేశారు. దీంతో మద్యం దొరకడం లేదు. దీన్ని అదనుగా చేసుకొని కొందరు మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజుల క్రితం మద్యం తీసుకొచ్చి నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం అధిక ధరలకు విక్రస్తున్నారు. ఒక్కొక్క బాటిల్‌ను రూ.500 వంతున అమ్ముతున్నారు. మద్యం విక్రయించరాదని పోలీసులు హెచ్చరించినప్పటికీ రహస్యంగా మద్యం అమ్ముతున్నారు. రాజకీయ పార్టీల నాయకులు మద్యం సరఫరా చేయలేక అడిగిన వారికి రూ.200 వంతున నగదు ఇస్తున్నారు. మద్యం ప్రియులు ఆ నగదుకు కొంత నగదు కలిపి మద్యం కొనుగోలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు మద్యం గొలుసు దుకాణాల పై చర్యలు తీసుకోవడం లేదు.

పామూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు అధికారులు సీల్ వేశారు. దీంతో కొందరూ ముందుగానే మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కొక్క బాటిల్‌ను రూ.300 నుంచి రూ.500 విక్రయిస్తున్నారు. అయినప్పటికీ గంత్యరం లేక మందు బాబులు అధికల ధరలకు మద్యం కోనుగోలు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కొండపి

మండల కేంద్రమైన కొండపి గ్రామానికి చెందిన రెండు కుటుంబాల వారు ఆదివారం టిడిపిలో చేరారు. టిడిపి యూత్ మండల అద్యక్షుడు కాలేషా ఆధ్వర్యంలో టిడిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సమక్షంలో పార్టీలో చేరారు. అదేవిధంగా మర్రిపూడి మండలం వేమవరం గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో 13 కుటుంబాల వారు టిడిపిలో చేశారు. వేమవరం గ్రామానికి చెందిన బొల్లా వెంకటనారాయణ, గోగిగుంట రమణయ్య, మందాడి వెంకటనరసయ్య టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-కొండపి



తిరుపతమ్మ(ఫైల్)

వడదెబ్బతో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని పెట్లూరు ఎస్‌టి కాలనీలో ఆదివారం చోటు చేసు కుంది. అందిన వివరాల ప్రకారం... పెట్లూరు ఎస్టీకాలనీ చెందిన దేవరకొండ తిరుపతమ్మ (68) బేల్దారి పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు రెండు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చింది. ఎండ తీవ్రత నేపథ్యంలో శనివారం అస్వస్థత గురైంది. ఇంటి వద్దే చికిత్స పొందుతూ మృతిచెందింది.

మాజీ పాత్రికేయుడు డేవిడ్ మృతి

ప్రజాశక్తి-దర్శి



డేవిడ్(ఫైల్)

దర్శికి చెందిన మాజీ పాత్రికేయుడు మున్నంగి డేవిడ్ (67) ఆదివారం మృతి చెందారు. డేవిడ్ గతంలో ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ తదితర పత్రికల్లో పని చేశారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డేవిడ్ మృతి పట్ల పలువురు జర్నలిస్టులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను సానుభూతిని తెలియజేశారు.

ఓటర్ స్లిప్పుల కోసం అవస్థలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

బిఎల్‌ఒల నిర్లక్ష్యం కారణంగా ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందలేదు. వాస్తవంగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాల్సిన బాధ్యత బిఎల్‌ఒలపై ఉంది. అయితే ఇక్కడ అలా జరగలేదు. మండల కేంద్రమైన సిఎస్‌పురంలో అనేక మందికి ఓటరు స్లిప్పులు ఆదివారం రాత్రి వరకూ పంపిణీ చేయలేదు. దీంతో ఓటర్ స్లిప్పులు ఎక్కడ తీసుకోవాలో అర్థం కాక ఓటర్ల ఆందోళన చెందుతున్నారు. ఓటరు స్లిప్పులు తమకు ఎందుకు అందజేలేదు అర్థం కావడం లేదని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది గంటలలోనే ఓటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఓటరు స్లిప్పులు లేక పోతే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని తహాశీల్దారు నాగుల్‌మీరా దృషికి తీసుకెళ్లగా బిఎల్‌ఒలతో మాట్లాడి అందరికీ ఓటర్ స్లిప్పులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సార్వత్రిక సమరం





టిడిపిలో చేరిన కోటపాడు ఎస్సీ కాలనీ వాసులు

టిడిపిలో చేరిన ఎస్‌సి కాలనీ వాసులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కోటపాడు ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాలు ఆదివారం వైసీపీని వీడి టిడిపిలో చేరారు. ముప్పవరంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో చేరారు. వీరికి రవికుమార్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కోటపాడు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పులు పంచని బిఎల్‌ఒ

ప్రజాశక్తి - మర్రిపూడి

మండల కేంద్రమైన మర్రిపూడిలోని 20వ నెంబర్ పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్లకు ఎన్నికల స్లిప్పులు అందించకపోవడంతో ఓటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఓటరు స్లిప్పుల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ సంబంధిత పోలింగ్ కేంద్రం బిఎల్‌ఓ స్పందించట్లేదని ఓటర్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు పిర్యాదు చేయడంతో క్రింది స్థాయి అధికారులకు ఓటరు స్లిప్పులు పంచాలని ఆదేశించారు.



రాష్ట్ర, జిల్లా త్రివిధ దళ కమిటీ ఛైర్మన్ రెడ్డి వరప్రసాద్

మాజీ సైనికుల వార్షిక సమ్మేళనం

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర, జిల్లా మాజీసైనికుల ఆర్థిక సంవత్సర సమ్మేళనం నరాలశెట్టి వారి పాలెం మాజీసైనికుల తాత్కాలిక కార్యాలయంలో నిర్వహించారు. మాజీసైనికుల కమిటీ ముఖ్య కార్యదర్శి షేక్ కాలేషా, కోశాధికారి వంశీ కృష్ణ అధ్యక్షత వహించారు. భారత మాతకు జైజైలతో అమరవీర సైనికులకు నివాళి అర్పించారు. 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి ఆర్థిక సంవత్సరానికి సంబంధిత సేవలు, మాజీ సైనికుల విద్య, వైద్య, ఆరోగ్య పరమైన సేవలు, సమస్యలు, సభ్యత్వం రెన్యువల్, త్రివిధ దళాల ఉత్తర్వులు, సమాజ సంక్షేమ సేవలు, నూతన కమిటీ ఎన్నిక, అకౌంట్ ఆడిటింగ్ బాడీల ఎన్నిక, అసోసియేషన్ ప్రగతి, టెలికాం డిపార్ట్మెంట్, కళాకారులకు అందిస్తున్న సేవలు వంటి అంశాలపై రాష్ట్ర, జిల్లా త్రివిధ దళ మాజీ సైనికుల కమిటీ స్థాపకులు, ఛైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ వివరించారు. 515మంది సభ్యులు గల అసోసియేషన్‌లోని మాజీసైనికులు, వితంతువులు ఏవిధంగా తమ సమస్యలను పరిష్కరించి మానసికంగా, ఆర్థికంగా ఆదుకొని సేవలందించారో సంతోషంతో తెలిపారు. ఈ సందర్భంగా త్రివిధ దళ మాజీ సైనికుల కమిటి ఛైర్మన్ వర ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. 13న జరుగబోవు ఎన్నికల్లో మాజీసైనికుల పాత్ర కూడా ప్రాముఖ్యమైనదని తెలిపారు. ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీసైనికులు, వితంతువులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ఐదేళ్లూ అవరోధాలే

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఒక్క అవకాశం ఇవ్వండంటు అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవరోధాలే తప్ప అభివృద్ధి లేదని, ప్రజలకు ఈ ఎన్నికలే సరైన అవకాశమని, ప్రతి ఒక్కరూ ఆలోచించి రాష్ట్ర భవిష్యత్తు కోసం సరైన నిర్ణయం తీసుకోవాలని టీడీపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు కోరారు. తన క్యాంపు కార్యాలయంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వారికి టిడిపి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఐదేళ్ల వైసిపి అరాచక పాలనకు ఓటు అనే ఆయుధంతో చరమ గీతం పాడాలని కోరారు. యువ ఓటర్లంతా బంగారు భవిష్యత్తు కోసం ఆలోచించి ముందుచూపు కలిగిన నేతలకు ఓట్లు వేసి ఎన్నుకోవాలని కోరారు. తాము అధికారానికి వచ్చాక అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని తెలిపారు. అపార అనుభవం కలి గిన చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని అన్నారు. టిడిపి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అమలు చేస్తామని అన్నారు. కూటమి ఎవరూ ఊహించని విధంగా మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అన్ని రంగాలను అభివృద్ధి చేశామని అన్నారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలతో రెండు పర్యాయాలు విజయం సాధించానని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో మళ్ళీ విజయం సాధిస్తాననే ధీమా వ్యక్తం చేశారు.

ఎంఎల్‌ఎ ఏలూరి సమక్షంలో చేరిక

టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి, ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు సమక్షంలో వింజనంపాడు, అనంతవరం, నూతలపాడు, కోనంకి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టిడిపిలో ఆదివారం చేరారు. వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



ఎంఎల్‌ఎ గొట్టిపాటి సమక్షంలో టిడిపిలో చేరిన జెడ్‌పిటిసి

టిడిపిలో చేరిన జడ్పీటీసీ అంజలి

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన బల్లికురవ జెడ్‌పిటిసి చింతల అంజలి శ్రీనివాసరావు వైసిపిని వీడి తన అనుచరులతో కలిసి టిడిపిలో ఆదివారం చేరారు. వారికి ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్ టిడిపి కండువ మెడలో వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ముగిసిన ప్రలోభాల పర్వం..!

ప్రజాశక్తి - మార్కాపురం

నియోజకవర్గంలో ప్రలోభాల పర్వం ముగిసింది. వారం రోజులుగా మొదలైన డబ్బు, మద్యం పంపిణీ ఆదివారం రాత్రి వరకు కొనసాగింది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేశారు. ప్రలోభాల్లో వైసిపి, టిడిపి పోటీ పడ్డాయి. ఆ రెండు పార్టీలు డబ్బు, మద్యం పంపిణీ చేశాయి. ఓటర్లు కూడా ఎవరిచ్చినా తీసుకోవడం రెండు పార్టీల అభ్యర్థులను కలవర పెడుతుంది. ఓటు మాత్రం ఎవరికి వేస్తారనేది సందేహంగా మిగిలింది. నెల రోజులుగా ఎన్నికల జాతర జరిగింది. వైసిపి, టిడిపిలు పోటా పోటీగా ప్రచారాలు నిర్వహించాయి. వైసిపి తరపున అన్నా వెంకట రాంబాబు, టిడిపి తరపున కందుల నారాయణరెడ్డి పోటీలో ఉన్నారు. వీరిద్దరూ గెలుపే లక్ష్యంగా ప్రలోభాల్లోనూ పోటీ పడ్డారు. ప్రతి రోజు ఏదొక పార్టీ విందుల్లో ఓటర్లు కూడా పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ దఫా ఎన్నికల ఖర్చు పెరిగింది. ఎన్నికల్లో వ్యయాన్ని నియంత్రించేందుకు చర్యలు కట్టుదిట్టం చేసినా పనిచేసే సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరించానే ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల ఖర్చు ఎంఎల్‌ఎ అభ్యర్థికి రూ.100కోట్లు దాటిందనే అంచనాలు వేస్తున్నారు. ఓటుకు రూ.1500 నుండి రూ.2వేలు వరకు పంపిణీ చేశారు. పోస్టల్ బ్యాలెట్లను అత్యధిక మంది ఉద్యోగులు అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.2వేల నుంచి రూ.3వేల వరకు పోస్టల్ బ్యాలెట్ కొనుగోలు చేశారనే ప్రచారం జరిగింది. వైసిపి, టిడిపిలకు చెందిన ఒక్కో అభ్యర్థి 1.50లక్షల ఓట్ల వరకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. నియోజకవర్గంలో ఓటర్లు మాత్రం 2 లక్షల 14వేల 60 మంది ఉన్నారు. దీన్నిబట్టి చూస్తే అత్యధిక మంది ఓటర్లు రెండు పార్టీల నుంచి ఓటుకు నోటు తీసుకున్నట్లు అర్థమవుతంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పోటా పోటీగా ప్రచారంతోపాటు నగదు, మద్యం పంపిణీ చేశారు. గ్రామాల్లో కుటుంబాలవారీగా ప్రలోబపెట్టి పార్టీలు మార్చుకునే ప్రయత్నాలు చేశారు. ఎంఎల్‌ఎ అభ్యర్థుల తోపాటు పార్లమెంటు అభ్యర్థులూ పెద్ద మొత్తంలో ఖర్చులు పెట్టుకోవ డంతో నియోజక వర్గంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. కోట్లలో ఖర్చు పెట్టుకున్నప్పటికీ ఓటర్ల తీర్పు అనుకూలంగా ఉంటుందన్న గ్యారెంటీ కనిపించలేదు. పార్లమెంటు అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే నియోజకవర్గాల్లో మార్కాపురం ఒకటి కావడంతో ఇరుపార్టీల అభ్యర్థులు ప్రత్యేక దృష్టిపెట్టారు. టిడిపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి తన పట్టు నిలుపుకునే ప్రయత్నం చేయగా వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి జగన్‌పై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని నమ్ముకున్నారు. ఇరువైపులా తీసుకున్న ఓటర్లు ఎటువైపు ఓటు ఉంటుందోనని అభ్యర్థుల్లోనూ గుబులు రేకెత్తిస్తోంది. నేడు జరిగే పోలింగ్‌లో ఎవరికి వారే తమకు అనుకూలంగా ఉంటుందని అన్నా వెంకటరాంబాబు, కందుల నారాయణరెడ్డి ధీమాగా ఉన్నారు.

స్టువర్టుపురం సర్పంచ్ బోగిరి ప్రసాద్ మృతి

ప్రజాశక్తి - బాపట్ల



ప్రసాద్‌కు నివాళులర్పిస్తున్న నరేంద్ర వర్మ

మండలంలోని స్టువర్టుపురం పంచాయతీ సర్పంచ్ బోగిరి ప్రసాద్(36) ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందారు. టిడిపి సర్పంచిగా ప్రసాద్ కొనసాగుతున్నారు. స్వల్ప స్వస్థత గురైన ఆయన హఠాత్తుగా కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. స్టువర్టుపురం సర్పంచి భోగిరి ప్రసాద్ మృతి టిడిపికి తీరనిలోటని టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. ప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి ఓ మంచి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. ఆయన కుటుంబానికి టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

అస్తవ్యస్తంగా నీటిపారుదల కాలువలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు



కోతకు గురైన వెల్లటూరు ఛానల్

రైతుల కోసం ప్రభుత్వం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెబున్నప్పటికీ గత ఐదేళ్లుగా సాగునీటి కాల్వలు ఎలాంటి మరమతులకు నోచుకోక రైతులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో నీటి సంఘాల ఆధ్వర్యంలో సాగునీటి కాలువలను మరమ్మతులు చేస్తూ ఉండేవారు. కానీ ప్రస్తుత వైసిపి పాలనలో గత ఐదేళ్లుగా ఎలాంటి మరమ్మత్తులు చేయక పోవడంతో కాలువలు ఎక్కడకక్కడ కోతకు గురై గండ్లు పడి అధిక వర్షాలు సమయంలో నీరు ఎగదట్టి పంట పొలాలను ముంచేస్తుందని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెలాటూరు నుండి ప్రారంభమైన వెల్లటూరు ఛానల్ కాలువ భట్టిప్రోలు ప్రారభంలో బాలసౌరి కాలనీ వద్ద కోతకు గురై సిసి రహదారి వరకు కాలువ చుచ్చుకొని వచ్చింది. రహదారి సిమెంటు రోడ్డు సైతం విరిగి కాలువలో పడే పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై వందల ఎకరాల పంట పొలాలకు రైతులు నిత్యం రాకపోకలు, పంట ఉత్పత్తుల రవాణ కొనసాగిస్తూ ఉంటారు. వర్షాకాలంలో సాగునీరు విడుదల చేసిన సమయంలో కాలవలో నీరు రహదారికి ఆనుకని నీరు పారుతూ ఉంటుంది. దీని కారణంగా రైతులు ప్రత్యేక తీవ్రంగా నష్టపోతున్నారు. పంట పొలాలకు వెళ్లే ట్రాక్టర్లు ఎడ్లబండ్లు ఎక్కడ జారి కాలువలో పడతాయోననీ భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలోనే కాక వెల్లటూరు ఛానల్ పరిధిలో భట్టిప్రోలు, ఐలవరం, అద్దంకివారిపాలెం గ్రామాలు పరిధిలో కూడా ఛానల్ కోతకు గురైంది. నీటిని పూర్తిగా విడుదల చేసిన సమయంలో కట్టలు తెగిపోయే పరిస్థితిలో ఉంది. ఎక్కడ పొలాలను ముంచెత్తుతుందోనని రైతుల ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల అనంతరం ప్రస్తుత వేసవి కాలంలోనైనా దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేపడితే రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు సక్రమంగా అందుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విదేశాల నుంచి వచ్చిన ఓటర్లు

ప్రజాశక్తి - బాపట్ల

ఈ సారి ఎన్నికల్లో ఓటింగ్ సరళి అనూహ్యంగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. నూతన ఓటర్ల శాతం పెరగడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. దీనికి తోడు ఎన్‌ఆర్‌ఐలు రూ.లక్షలు ఖర్చు పెట్టుకొని కేవలం ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంత గ్రామాలకు వచ్చారు. నియోజకవర్గంలోని అప్పికట్ల, నరసాయపాలెం, కంకటపాలెం, జమ్ములపాలెం ప్రాంతాలకు చెందిన ఎన్నారైలు అధిక శాతం తమ ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు స్వగ్రామాలకు వచ్చేశారు. ఈ ఓటర్లలో ఎక్కువ మంది యువ జంటలు కనిపిస్తున్నారు. సహజంగా డిమాండ్ వున్నప్పుడు విమాన ప్రయాణ చార్జీలు అమాంతంగా పెంచేసినప్పటికీ వెనకడుగు వేయకుండా ఉత్సాహంగా ఓటు కోసం వస్తున్నారు. తెలంగాణ ప్రవాసుల కన్నా ఆంధ్రప్రదేశ్ వాళ్లే అధిక శాతం వస్తున్నారని బస్సు, రైలు, విమానం, కార్ల వంటి ప్రయాణ సాధనాల గణాంక వివరాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఖర్చుకు వెనకాడకుండా వచ్చినట్లు చాలా మంది చెప్పారు. ఓటు వేయడం ఒక బాధ్యతగా భావించి మేలు చేసే నాయకులను ఎన్నుకోవాలనే లక్ష్యంతో వచ్చిన ఓటర్లతో ఓటింగ్ శాతం మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.



సార్వత్రిక సమరం



సార్వత్రిక సమరానికి రెడీ



చంటి బిడ్డతో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి వచ్చిన అధికారి

- ఒంగోలు అసెంబ్లీలో 2.40 లక్షల ఓటర్లు
- 259 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణ
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. ఒంగోలు నియోజక వర్గంలో ఎన్నికల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజక వర్గంలో 2,40,242 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజక వర్గాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సమస్యాత్మక నియోజకవర్గంగా ప్రకటించటంతో కేంద్ర బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ తీరును పరిశీలించనున్నారు.

ఓటు వేయనున్న 2.40 లక్షల ఓటర్లు

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 259 పోలింగ్ కేంద్రాలు ఉంది. 2,40,242 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,15,495 మంది, మహిళలు 1,24,694 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 53 మంది ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అన్ని ఏర్పాట్లు చేశారు. పెట్రోలింగ్ పార్టీలతో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



దర్శిలో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

పోటీలో 26 మంది అభ్యర్థులు

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరి కోసం 2 బ్యాలెటింగ్ యూనిట్లను అధికారులు ఏర్పాటు చేశారు. వైసిపి, టిడిపి-బిజెపి-జనసేన కూటమి మధ్యనే తీవ్రమైన పోటీ నెలకొంది. అధికార వైసిపి తరపున బాలినేని శ్రీనివాస రెడ్డి, కూటమి అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఇరు పార్టీ అభ్యర్థులు నియోజకవర్గ పరిధిలో ముమ్మర ప్రచారం చేపట్టి నువ్వా నేనా అన్న రీతిలో విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. వామపక్షాలు బలపర్చిన ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తురకపల్లి నాగలక్ష్మి పోటీ చేస్తున్నారు. ఈమె ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలం ఒంగోలు నగరంలో ప్రచారం నిర్వహించారు. వామపక్ష పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించి ప్రచారంలో పాల్గొన్నారు. మరో 23 మంది రిజిస్టర్ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.



ఒంగోలులో ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న పోలింగ్ అధికారులు

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఒంగోలు రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ టెక్నాలజీస్ లో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒంగోలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి జివి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పిఒలు, ఎపిఒలు, ఒపిఒలకు పోలింగ్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. పోలింగ్ సామాగ్రితో ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది ఆర్‌టిసి బస్సులలో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది.

శింగరాయకొండ : సార్వత్రిక ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టంగుటూరు మండలం వల్లూరు వద్ద ఉన్న రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజక వర్గ పరిధిలో మొత్తం 253 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గ ఎన్నికల అధికారి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పోలింగ్ సామగ్రిని ఆయా కేంద్రాలకు తరలించారు. పోలింగ్ విధులకు కేటాయించిన పోలీసు సిబ్బందికి ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ ఆధ్వర్యంలో విధుల నిర్వాహణపై అవగాహన కల్పించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల చుట్టు పరిసరాలను ఆదివారం రాత్రే పరిశీలించాలన్నారు. ప్రతి విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బందోబస్తు విషయంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్‌పి, సిఐ దాచేపల్లి రంగనాథ్, కొండపి సిఐ పాండు రంగరావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిఎస్‌పురంలో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన సిబ్బంది



పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్తున్న కేంద్ర బలగాలు

దర్శి : దర్శి నియోజకవర్గంలో ఐదు మండలాలలో మొత్తం 282 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఒకటి నుంచి 47 పోలింగ్ కేంద్రాల్లో దొనకొండ మండల పరిధిలో ఉన్నాయి. 48 నుంచి 87 వరకూ కురిచేడు మండల పరిధిలో ఉన్నాయి. 88 నుంచి 104 వరకూ దర్శి రూరల్‌లో కొంత భాగంగా ఉన్నాయి. 105 నుంచి 137 వరకూ దర్శి టౌన్, 138 నుంచి 180 వరకు దరిశి రూరల్, 181 నుంచి 236 వరకూ ముండ్లమూరు, 237 నుంచి 282 వరకూ తాళ్లూరు మండల పరిధిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేష్‌రావు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో మొత్తం 22, 6370 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. పురుషులు 11,4,233, స్త్రీలు 1,12,129, ఇతరులు 8 మంది ఉన్నట్లు తెలిపారు. 58 రూట్లు, 35 సెక్టార్లు 282 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,692 మంది పోలింగ్ సిబ్బంది విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. 58 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి అక్కడ తగిన భద్రత కల్పించినట్లు తెలిపారు. అడిషనల్ ఎస్‌సి హర్ష, ఇద్దరు ట్రైనింగ్ ఎస్‌పిలు, ఐపిఎస్. ఒక డిఎస్‌పి, 8 మంది సిఐలు, పది మంది ఎస్‌ఐలు, 500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్లు దర్శి డిఎస్‌పి టి.అశోక్‌వర్ధన్ తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కనిగిరి : సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ పాలపర్తి జాన్ ఇర్విన్ సర్వం సిద్ధం చేశారు. పటిష్ట బందోబస్తు నడుమ పోలింగ్ ప్రక్రియ సాగేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సామగ్రిని ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించే ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు, పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లను చేపట్టారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 297 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వాహణకు 1,485 మంది సిబ్బందిని నియమించారు. నియోజకవర్గంలో మొత్తం 2,40,079 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,21,356 మంది పురుషులు, 1,18,710 మంది మహిళలు, ఇతరులు 13 మంది ఉన్నారు. కనిగిరి మండలంలో 36,701 మంది పురుషులు, 36,051 మంది మహిళలు, ఇతరులు11 మంది ఉన్నారు. హనుమంతునిపాడు మండలంలో 11,981 మంది పురుషులు, 11482 మంది మంది మహిళలు ఉన్నారు. వెలిగండ్ల మండలంలో 14,677 మంది పురుషులు, 11,978 మంది మహిళలు ఉన్నారు. చంద్రశేఖరపురం మండలంలో 17,399 మంది పురుషులు, 16,859 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. పెద్ద చెర్లోపల్లి మండలంలో 14,901 మంది పురుషులు, 14,462 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. పామూరు మండలంలో 25,697 మంది పురుషులు, 25878 మంది మహిళలు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఓటర్లు అందరూ తమ యొక్క ఓటు హక్కును స్వేచ్ఛాయితంగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

సిఎస్ పురంరూరల్ : సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సిద్ధం చేశారు. మండలంలో మొత్తం 34, 259 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 17399 మంది పురుషులు, 16,8509 మంది మహిళలు ఉన్నాయి. పోలింగ్ కఓసం 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించ నున్నట్లు తహశీల్దారు షేక్ నాగుల్ మీరా తెలిపారు.



కనిగిరిలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ జాన్ ఇర్విన్



దర్శిలో ఎన్నికల సామగ్రి కేంద్రం వేసియున్న పోలింగ్ అధికారులు



పేస్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద పోలీసు సిబ్బంది సూచనలు చేస్తున్న ఎస్‌పి

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో జరుగనున్న ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ తెలిపారు. ఆదివారం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులకు హాజరయ్యే సిబ్బందికి సెక్టార్ల వారిగా పని బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విధుల నిర్వహణ కోసం వెళ్తున్న సిబ్బంది కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ఎలాంటి సహాయం అందించడానికైనా సంసిద్ధంగా ఉందని చెప్పారు. తీసుకువెళ్లిన సామగ్రిని పోలింగ్ అనంతరం తిరిగి అప్పగించేంత వరకూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఆయా ప్రాంతాలలో సిబ్బందికి అవసరమైన అన్ని వసతులూ కల్పించామని అన్నారు. ఏ విధమైన సహాయం కావాలన్నా బిఎల్ఓలు, సెక్టార్ ఆఫీసర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. శాంతిభద్రతలకు, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నామని చెప్పారు. ఓటరు కార్డుకు బదులుగా 12 గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయవచ్చునని తెలిపారు. వాటిలో ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, దివ్యాంగుల ఐడెంటిటీ కార్డు, ఎంఎన్ఆర్‌ఏ జాబ్ కార్డు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, ఆర్బీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, పోస్టాఫీస్ లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రాలలో దేనినైనా చూపిస్తే ఓటరుకు ఓటు వేసే అవకాశం కల్పించాలని తెలిపారు. సిబ్బంది అంతా సమిష్టి కృషి చేసి యర్రగొండపాలెం నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆమె చెప్పారు.




హాజరైన ఎన్నికల సిబ్బంది, మాట్లాడుతున్న ఆర్వో డాక్టర్ శ్రీలేఖ

ప్రార్థన మందిరాల్లో ఎన్నికల ప్రచారమా?

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలోని క్రైస్తవ ప్రార్థన మందిరంలో ఆదివారం ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఎన్నికల ప్రచారం చేయడం కలకలం రేపింది. క్రైస్తవ సంఘ పెద్దలతో తమ రాజకీయ పార్టీని గెలిపించాలని మందిరంలోని మైక్ ద్వారా చెప్పించడం గ్రామంలో సంచలనం సృష్టించింది. ప్రార్థన మందిరాల్లో ప్రార్థనలు జరగాలే తప్ప రాజకీయ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని చెప్పడం సమంజసమా అని పలువురు క్రైస్తవులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై చర్చోపచర్చలు సాగాయి. సంఘసేవకులు మందిరాల్లో ఇకపై ఇలాంటి అనైతిక పనులు చేయరాదని పలువురు దైవజనులు ఆవేదనతో గుసగుసలాడుతున్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న ఎన్నికల స్టేట్ అబ్జర్వర్ మయూర్ కె మెహతా

ఈవీఎంల పరిశీలన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సోమవారం జరగనున్న ఎన్నికల కోసం సిబ్బందికి కేటాయించేందుకు యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్ధంగా ఉంచిన ఈవీఎం మిషన్‌లను ఎన్నికల స్టేట్ అబ్జర్వర్ మయూర్ కె మెహతా ఆదివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ ఉన్నారు.



ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్న ఆర్వో శ్రీలేఖ

పాలుట్లకు ఎన్నికల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని పాలుట్ల పోలింగ్ కేంద్రం జిల్లాలోనే మొట్ట మొదటిది. ఈ పోలింగ్ కేంద్రానికి మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న రోజుల్లో ఎన్నికల సమయంలో హెలికాప్టర్ ద్వారా సిబ్బందిని తరలించి తిరిగి హెలికాప్టర్ ద్వారానే సిబ్బందిని తీసుకొచ్చేవారు. అయితే మావోయిస్టుల ప్రాబల్యం తగ్గిన తర్వాత కమాండర్ వాహనాల ద్వారా సిబ్బందిని తరలిస్తున్నారు. సోమవారం జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో ఆదివారం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాలుట్ల పోలింగ్ సిబ్బందికి నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలుట్ల పోలింగ్ కేంద్రంలో 509 మగ, 457 స్త్రీ ఓటర్లు కలిపి మొత్తం 966 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులను నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి సందేహాలు తలెత్తినా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన హ్యాండ్ బుక్ చదవాలని చెప్పారు. పోలింగ్ సిబ్బంది సమిష్టిగా పని చేయాలని కోరారు. ఆమె వెంట ఏఈఆర్వో సోమ్లా నాయక్ తదితరులు ఉన్నారు.



బస్సుల్లో తరలి వెళుతున్న పోలింగ్ సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద ఉన్న ట్రిబుల్ ఐటీ కళాశాలలో నియోజకవర్గ స్థాయిలో 256 పోలింగ్ ఈవీఎంలు ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా వారి గమ్యాలకు తరలించారు. జిల్లా జాయింట్ కలెక్టరు సంతనూతలపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ గోపాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇందుకు గాను 1,750 మంది అధికారులు సిబ్బందిని నియమించినట్లు ఆర్ఓ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,13,958 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 13వ తేదీ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల దాకా జరుగుతుందని ఆయన తెలిపారు.



పోలింగ్ నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

సోమవారం జరగనున్న ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గిద్దలూరు సెయింట్ పాల్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ నిర్వహణ కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈవిఎంలు, పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్, సిబ్బంది తదితర అంశాలపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ చెక్‌లిస్టు ప్రకారం పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేయాలని గిద్దలూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ డి నాగజ్యోతికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులూ కల్పించామని అన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అవసరం వచ్చినా తీర్చేందుకు బిఎల్ఓలు, సెక్టార్ ఆఫీసర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ విధులకు గైర్హాజరు అయిన సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. ఆదివారం యర్రగొండపాలెంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని కోరారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోగల 265 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 29 సెక్టార్లుగా విభజించి పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్‌ను నియమించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ బాక్స్‌లను భద్రంగా ఉంచాలని, పోలింగ్ స్టేషన్లోనే సిబ్బంది బస చేయాలని కోరారు. పోలింగ్ శాతం ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేయాలని కోరారు. పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఆయన వెంట యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ పి శ్రీలేఖ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి
7
సోమవారం 13 మే 2024



మాట్లాడుతున్న వైసిపి నేత మార్పు రత్నం

రాజేష్‌పై ఎవరూ దాడి చేయలేదు

ప్రజాశక్తి - కర్లపాలెం

ఎంఎల్‌ఎ కోన రఘుపతి కుటుంబం జోలికొస్తే సహించేది లేదని, కోన వెంకట్‌పై తప్పుడు కేసులు పెట్టారని వైసిపి నేత మార్పు రత్నం అన్నారు. స్థానికంగా వైసిపి నాయకులు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు మండలంలోని లంక మాలపల్లి గ్రామానికి చెందిన కత్తి రాజేష్ అనే వ్యక్తి తన వద్ద రూ.8.25వేల నగదు కాజేశాడని ఆరోపించారు. తను వేరు శనగ, ధాన్యంకి సంబంధించిన నగదును కారులో పెట్టగా అతను అపహరించాడని అన్నారు. మొన్నటి వరకు రాజేష్ అనే వ్యక్తి వైసిపిలో ఉండగా అందరం కలిసి ఎలెక్షన్ చేద్దామని కూడా మాట్లాడుకున్నామని అన్నారు. ఈ క్రమంలోనే శనివారం తన నగదును అపహరించి టిడిపిలో చేరాడని అన్నారు. తాను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కి వచ్చి ఎస్‌ఐ జనార్ధన్‌కు సమాచారం తెలుపడంతో స్టేషన్‌కు పిలిపించారని చెప్పారు. పిలిచి మాట్లాడామే తప్ప అతనిపై ఎటువంటి దాడి చేయలేదని తెలిపారు. కోన వెంకట్ పెదపులుగు వారి పాలెం ప్రచారంలో భాగంగా స్టేషన్ వైపుగా వస్తూ తమ కనపడే సరికి ఆగి నగదు విషయం కదా కొంచెం న్యాయం చేయండని ఎస్‌ఐ జనార్ధన్‌కు చెప్పి వెళ్లిపోయారని అన్నారు. ఫిర్యాదు ఇవ్వడానికి బయటకి వచ్చి పేపర్ తీసుకొని రాసి ఇద్దామని అనుకునేలోపు టిడిపి నాయకులు అందరూ స్టేషన్ వద్ద గుమికూడడంతో అక్కడికి వెళ్లకుండా వెళ్ళిపోయానని తెలిపారు. టిడిపి నేతలు తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, మాజీ ఎంపిటిసి ఆమోస్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పురుష ఓటర్లే ఆధికం

ప్రజాశక్తి - పొదిలి

మండలంలో మొత్తం 51,550 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుషులు 26,013మంది ఉండగా 25,537 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 476 ఓట్ల మంది పురుషులు మహిళల కన్నా అధికంగా ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలను అధికారులు ప్రకటించారు.



టిడిపి ఆఫీసు వద్ద జనం చేరడంతో నిలిచిన ట్రాఫిక్

టిడిపి కార్యాలయం వద్ద రగడ

ప్రజాశక్తి - వేటపాలెం

మా కెందుకు డబ్బులు ఇవ్వలేదంటూ కొంత మంది ఓటర్లు స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి రగడ చేశారు. స్థానిక టిడిపి నాయకులతో వాదనకు దిగారు. చేసేదేం లేక టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఎంఎం కొండయ్యకు స్థానిక నాయకులు సమాచారం అందించారు. దీంతో ఆయన హుటాహుటేనా వేటపాలెం టిడిపి కార్యాలయానికి చేరుకున్నారు. సమస్య ఎక్కడ వచ్చిందంటూ బూతులు కన్వీనర్లపై ఆగహం వ్యక్తం చేశారు. వేటపాలెంలోని 193, 195, 196, 198, 200 ఎన్నికల పోలింగు బూతుల ప్రజలు కార్యాలయం వద్ద వాదనకు దిగారు. కొంత మంది మహిళలు నేరుగా కొండయ్యతో వాదనకు దిగారు. రాత్రి మీ ఇళ్లకు వద్దకు వచ్చి అందజేసే బాధ్యత తనదని ఆయన వారిని సముదాయించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనతో ప్రధాన రహదారిపై కార్యాలయం వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అటుగా వెళుతున్న కొంతమందికి అక్కడ ఏం జరుగుతుందని ఆసక్తిగా తిలకించటం కోసమెరుపు.

పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. స్థానిక బాపట్ల పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ పరికరాలను ఎన్నికల అధికారి చామకూరి శ్రీధర్ ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 202 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన పోలింగ్ సామాగ్రిని ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అందజేశారు. ఎన్నికల విధులకు ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో ఒక పిఓతో పాటు ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో మరో 20మంది సిబ్బందిని అవసరమైతే విధులు నిర్వహించేందుకు అదనంగా సిద్ధంగా ఉంచారు. నియోజకవర్గంలో 1500 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తారని అన్నారు. పోలింగ్ సామాగ్రి, సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు 46ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని అన్నారు. 47మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. 202 పోలింగ్ కేంద్రాలను 18రూట్లు, 18 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రానికే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సామగ్రితో చేరుకుంటారని తెలిపారు. ఉదయం 7గంటలకు ఓటర్లు ఓట్లు వేయడం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్‌ఓలు బాపట్ల తహశీల్దారు శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సామాగ్రి పంపిణీ చేస్తున్న ఆర్‌ఓ చామకూరి శ్రీధర్

పోలింగుకు సిద్ధం : ఆర్‌ఓ రవీందర్

ప్రజాశక్తి - పర్చూరు

నియోజకవర్గంలో పోలింగుకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి జి రవీందర్ తెలిపారు. ఓటర్లు అందరూ నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. స్థానిక బిఎఆర్ జూనియర్ కళాశాల్లో పోలింగ్ సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలు పంపిణీ చేశారు. కట్టుదిట్టమైన బద్రత మధ్య ఈవిఎంలను తరలించే బస్సులకు ఆధునిక జిపిఎస్ సిష్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 295 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు 3500 మంది సిబ్బంది, 600 మంది పోలీసులను నియమించినట్లు చెప్పారు. 2,29,333 మంది ఓటర్లలో 1,11,865 మంది మహిళలు, 1,17,462 మంది పురుషులు ఉన్నట్లు వివరించారు. మాక్ పోలింగ్ అనంతరం సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అవుతుందని చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంతరం ఎన్నికల స్థితిగతులను పరిశీలిస్తారని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరగటానికి అందరూ సహకరించాలని కోరారు.



సిబ్బందితో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి జి రవీందర్

పోలింగ్ కేంద్రాలకు పయనం

ప్రజాశక్తి - అద్దంకి

నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రితో తరలి వెళ్లారు. నియోజకవర్గంలో 298 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన అధికార యంత్రాంగం ఈవీఎంలు, ఇతర సామాగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా ఆదివారం తరలించారు. సోమవారం ఉదయం 5.45నిమిషాల నుండి మాకు పోలింగ్ నిర్వహించిన అనంతరం 7గంటల నుండి సంపూర్ణంగా ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.



పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

ఇవిఎం యంత్రాలతో తరలిన సిబ్బంది

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నేడు జరుగనున్న ఎన్నికలకు ఆసరమైన అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు తెలిపారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన ఈవిఎం, వివి ప్యాడ్లతోపాటు ఇతర పోలింగ్ సామాగ్రిని సిబ్బందికి ఆదివారం పంపిణీ చేశారు. దీనికిగాను ఆయా ప్రాంతాల నుండి వచ్చిన సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించారు. సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా వాహనాల్లో ఓటింగు యంత్ర సామాగ్రితో సిబ్బంది తరలి వెళ్లారు. నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఐదున్నర గంటలకే మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తరపు ఏజెంట్లు ఉదయం 5గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని మాక్ పోలింగులో పాల్గొనాలని సూచించారు. ప్రతి అభ్యర్థి తరపున 10ఓట్లు మాక్ పోలింగు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 7గంటలకు పోలింగు మొదలవుతుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుగానే సమస్యాత్మక పోలింగు కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన బద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు ఐ మునిలక్ష్మి, ఎంపిడిఓ మల్లికార్జునరావు, ఎంఈఓ దేవరాజ్ పాల్గొన్నారు.



ఈవిఎం, వివి ప్యాడ్లతో తరలి వెళ్తున్న పోలింగ్ సిబ్బంది



రోడ్డు ప్రమాదంలో బోల్తాపడ్డ కారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

వేగం నియంత్రణ చేయలేక కారు – మినీ లారీ ఢీకొన్న ఘటనలో మహిళకు తీవ్ర గాయాలు కాగా ఆమె భర్తకు స్వల్ప గాయాలు అయ్యాయి. అద్దంకి, మేదరమెట్లలోని బొడ్డువానిపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం ప్రమాదం జరిగింది. మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన బి బ్రహ్మయ్య, జ్యోతి దంపతులు ఓటు వినియోగించుకోవడానికి స్వగ్రామానికి వస్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఒంగోలు తరలించారు.



పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

నేటి ఎన్నికలకు రెడీ

ప్రజాశక్తి - మార్కాపురం

నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. ఎన్నికల పోలింగ్‌లో 2 లక్షల 14 వేల 60 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. స్థానిక ఎస్‌వికెపి కళాశాలలో ఇవిఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కేటాయించిన సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఆదివారం బయలుదేరారు. పోలింగ్ ఆఫీసర్లుగా 303మంది, ఎపిఓలుగా 300 మందిని నియమించారు. ఓపిఓలుగా 1028 మంది విధుల్లో ఉంటారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కో బిఎల్‌ఓ చొప్పున 257 మంది ఉంటారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు 303 మంది మైక్రో అబ్జర్వర్ల నియమించారు. వీరితో పాటు 30మంది సెక్టారు ఆఫీసర్లు విధుల్లో పాల్గొంటారు. నియోజకవర్గంలోని 257 పోలింగ్ కేంద్రాల్లో 68 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించినట్లు ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. అతి సమస్యాత్మక కేంద్రాలుగా 15 గుర్తించినట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి ఎం బాలసుందరం తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తినా మొబైల్ వాహనాల్లో పోలీసులు చేరుకుంటారని అన్నారు. గొడవలకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నేతలతో పాటు ఓటర్లు సహకరించాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

మండలంలోని పెదలంకలో ఆదివారం మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తిరగబడి యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. చింతమడుగు గ్రామానికి చెందిన దున్న శ్రీకాంత్ (28) అనే యువకుడు మట్టిలోడుకు వెళ్లి తిరిగి వస్తుండగా పెదలంక గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న శ్రీకాంత్ మట్టి కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య కలదు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఉన్నతాధికారులు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 'సమర్థ్' మొబైల్ యాప్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించనున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియ సోమవారం జరగనున్న నేపథ్యంలో ఆదివారం ఈవీఎం బాక్స్‌లకు, పోలింగ్ సిబ్బందికి రూట్ మొబైల్ పార్టీలు ఎస్కార్ట్ నిర్వహిస్తూ వారి వారి పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి 'సమర్థ్' మొబైల్ యాప్ ద్వారా స్వయంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగినా, ఏవైనా గొడవలు జరుగుతున్నా ఆ ప్రదేశానికి పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు వెంటనే చేరుకునేందుకు, జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు, ఏ పోలీస్ అధికారి ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు అనే విషయాలను వివరంగా తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడండి

వైసిపి అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని వైసిపి ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లా ఎస్పీ జిఎస్.సునీల్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు జిల్లా ఎస్పీని కలిశారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో భద్రత పెంచాలని కోరారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ వాళ్లు ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించారని, అందులో అందరి ఓటర్ల డేటా, ఫోన్ నెంబర్లు పొందుపరిచారని తెలిపారు. ఆ యాప్ వల్ల మహిళల భద్రతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఆ యాప్‌పై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఒంగోలులో బయట నుంచి వ్యక్తులను తెచ్చి తెలుగుదేశం పార్టీ వాళ్లు గొడవలు చేయాలని చూస్తున్నారని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలని తాము కోరుకుంటున్నామని, తెలుగుదేశం పార్టీ వాళ్లు కూడా అలాగే ఉండాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వైసిపి కార్యకర్తలు కూడా సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు.

నేడు సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా సమర్థంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా కోరారు. బాపట్ల హైస్కూల్ లో ఏర్పాటుచేసిన బాపట్ల అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన పోలింగ్ యంత్రాలు, సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి ఆదివారం పరిశీలించారు. తదుపరి చీరాలలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన చీరాల నియోజక వర్గం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితులు కల్పించామని, ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఎన్నికలలో ముఖ్యమైన ఘట్టంలోకి వెళ్తున్న అంశాన్ని ఉద్యోగులంతా గుర్తించి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. రీపోలింగ్ జరగకుండా అధికారులు చూడాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా ఉంటుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ యంత్రాలు ఉంటున్నాయనే విషయాన్ని పోలింగ్ సిబ్బంది గుర్తుంచుకోవాలన్నారు. ఓటింగ్ సరళని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పరిస్థితులపై దస్త్రాల్లో నిక్షిప్తం చేయాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గం ఆర్ఓ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఓటింగ్ ప్రారంభానికి ముందుగానే విధిగా మాక్ పోల్ జరపాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. 13వ తేదీన ఉదయం ఏడు నుంచి సాయంత్రం అరుగంటల వరకు ఓటింగ్ జరుగుతుందన్నారు. ఆయన వెంట చీరాల ఆర్ ఓ జి.సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు

ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్‌మిశ్రా రాక

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్లలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎన్నికల ఏపీ రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు రామ్మోహన్ మిశ్రా ఆదివారం బాపట్లకు చేరుకున్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్నికల పోలీస్ పరిశీలకులు కెప్టెన్ అయ్యప్ప, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై రాష్ట్ర ప్రత్యేక సాధారణ పరిశీలకులకు జిల్లా కలెక్టర్ నివేదిక అందించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



రామ్మోహన్‌మిశ్రాకు స్వాగతం పలుకుతున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల్లో

అన్ని వసతులూ కల్పించాం..

- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి
- పొరపాట్లకు ఆస్కారం లేకుండా పోలింగ్ నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి ఎ.ఎస్.దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-మార్కాపురం

పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సోమవారం జరగనున్నాయని, అందుకు సంబంధించిన పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విధుల నిర్వహణ కోసం వెళ్తున్న సిబ్బంది కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎలాంటి సహాయం అందించడానికైనా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

ఆదివారం ఉదయం మార్కాపురం పట్టణంలోని ఎస్‌వికెపి కళాశాలలోని ఇవిఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. పంపిణీ కేంద్రం నుంచి తీసుకెళ్లిన సామగ్రిని పోలింగ్ అనంతరం తిరిగి అప్పగించేంత వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఆయా ప్రాంతాల్లో సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు. ఏ విధమైన సహాయం కావాలన్నా బిఎల్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు. శాంతి భద్రతలకు, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులతు నిర్వహించాలని సిబ్బందిని కోరారు. విధి నిర్వహణలో ఎలాంటి సందేహాలు తలెత్తినా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన హ్యాండ్ బుక్‌ను చదవాలని చెప్పారు. పోలింగ్ సిబ్బంది సమిష్టిగా పనిచేయడం ద్వారా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా ముగించగలమన్నారు.

గైర్హాజరైన వారిని సస్పెండ్ చేస్తాం..

పోలింగ్ విధులు కేటాయించిన తరువాత ఏమైనా అనారోగ్య సమస్యలు, ఇతర సహేతుక కారణాల వలన విధులు నిర్వహించలేని పరిస్థితి ఉంటే పంపిణీ కేంద్రానికి వచ్చి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉన్నప్పటికీ... కొందరు గైర్హాజరు కావడంపై కలెక్టర్ దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట మార్కాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా, మార్కాపురం డిఎస్‌పి ఎం.బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

పోలీసు సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సిబ్బంది నిష్పక్షపాతంగా, నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించనున్న పోలీస్ అదికారులు, సిబ్బందికి, మాజీ ఆర్మీ ఉద్యోగులకు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులకు ఆదివారం బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలోని సమావేశ హాలులో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల రోజు, ఎన్నికల ముందు రోజు నిర్వహించవలసిన విధులు గురించి దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది, మాజీ ఆర్మీ ఉద్యోగులు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా, నిబద్ధతతో, నిజాయితీగా నిర్వహించాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూనే చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే వారు ఓటర్లను సరైన పద్ధతిలో క్యూ లైన్ లలో పంపాలని, ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే వారిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చేవారు తప్ప ఇతరులు ఎవరూ ఉండకూడదని, వాహనాలు కూడా రావడానికి అనుమతి లేదన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఓటింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించడానికి అనుమతి ఉంటుందన్నారు. ఆ పోలింగ్ కేంద్ర పరిధిలో విధులు నిర్వహించే మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లలోని అధికారుల ఫోన్ నెంబర్లు తెలుసుకొని ఉండాలన్నారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే అవకాశమున్న, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా వున్న వెంటనే మొబైల్ పార్టీలకు సమాచారం అందించాలన్నారు. వారు వచ్చి సమస్యను పరిష్కరిస్తారన్నారు.

మొబైల్ పార్టీలలో ఆయుధాలు కలిగిన పోలీస్‌లు విధులలో ఉంటారని, వారికి అప్పగించిన మార్గంలోని పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్ళే ఈవీఎం లకు, పోలింగ్ సిబ్బందికి ఎస్కార్ట్‌గా వెళ్ళి ఈవీఎం లను, పోలింగ్ సిబ్బందిని వారివారి పోలింగ్ కేంద్రాల వద్ద సురక్షితంగా దింపుతారని చెప్పారు. పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి బాపట్ల పట్టణంలోని బిఈసీ కాలేజీలో వాటిని సురక్షితంగా అప్పగించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచెయ్యడానికి ఎన్నికల ముందురోజు రాత్రి అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు పంపిణి చేసే అవకాశం ఉంటుంది కనుక వాటిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. రాష్ట్రమంతా సెక్షన్ 144 సీఆర్పీసీ అమలులో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువమంది గుమిగూడితే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. 'సమర్థ్' మొబైల్ యాప్ ను జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు వారి మొబైల్ లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ లో సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాల వివరాలు, వాటి లొకేషన్ లు, మీకు అందుబాటులో వున్న స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్, రూట్ మొబైల్ పార్టీ లలో విధులు నిర్వహించే పోలీస్ అధికారుల వివరాలు, వారి లొకేషన్ తెలుసుకోవచ్చునని తెలిపినారు. తద్వారా ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే యాప్ లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే మీ పరిధిలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తాయని అర్థమైయేవిధంగా యాప్‌లో మీరు ఎరుపు రంగులో సూచించబడతారన్నారు. తద్వారా మీకు సమీపంలో ఉన్న స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్, రూట్ మొబైల్ పార్టీ లు నావిగేషన్ ద్వారా మీరు ఉన్న ప్రదేశానికి వేగంగా చేరుకుని శాంతిభద్రతలను పరిరక్షిస్తారని తెలిపారు. ఎన్నికల విధులలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ సిహెచ్.మురళీకృష్ణ, బాపట్ల పట్టణ సిఐ యు.శ్రీనివాసులు, బాపట్ల రూరల్ స్టేషన్ సిఐ వై.శ్రీహరి, బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ బి.హజరత్ బాబు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.